క్లుప్తంగా

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్ : అబ్దుల్ మజీద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కడప ఐటీఐ వద్ద ఉన్న ఇక్బాల్ రైల్ మిల్లులో మగ్బుల్ మంజిల్‌లో ఉర్దూ కవి సమ్మేళనం, ఉత్తమ ఉర్దూ కవులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మగ్బుల్ అహ్మద్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న ఉర్దూ ఉత్తమ కవులు డాక్టర్ సత్తార్ సాహెబ్, గౌస్‌ఖాన్ ఆరీఫ్, సత్తార్ ఫైజీలను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ కవులు, సాహితీ అభిమానులు పాల్గొనాలని కన్వీనర్ జమీల్ అహ్మద్ కోరారు.

ఉపాధి నైపుణ్యంపై రెండు రోజుల వర్క్‌షాప్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఉపాధి నైపుణ్యాలపై 4, 5 తేదీలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ డా. కె. లలిత, కో కన్వీనర్ డా. వి. లాజరస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. సరిత, డా. కె. రియాజున్నీసా, డా. సునీత ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, వ్యాపార, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రాజెక్టు తయారీ, డిజిటల్ ఖాతాల నిర్వహణ, నూతన వ్యాపార సంస్థల ఏర్పాటు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

యోగాతో ప్రశాంతత



యోగా చేస్తున్న సాధకులు

కడప కల్చరల్ : మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆయా కుటుంబాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఆర్తీ హోం అధ్యక్షులు పీవీ సంధ్య అన్నారు. హోం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న ఆర్తీ ఉమెన్స్ సెంటర్‌లో శనివారం యోగ శిక్షణా కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. హోం కార్యదర్శి బి.దుర్గాకుమారి మాట్లాడుతూ మహిళలు యోగా శిక్షణలో పాల్గొని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. యోగా శిక్షకులు రెడ్డెయ్య మాట్లాడుతూ యోగా, ధ్యానంతో ఎన్నో మానసిక సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్తీ స్కూలు డైరెక్టర్ భాగమ్మ, భద్రమ్మ, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'చందమామ నాగిరెడ్డి'కి నివాళి

కడప కల్చరల్ : చందమామ బాలల పత్రిక సంపాదకులు, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, జిల్లాకు చెందిన బొమ్మిరెడ్డి నాగిరెడ్డికి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఘనంగా నివాళులర్పించింది. శనివారం కేంద్రంలో నాగిరెడ్డి జయంతిని నిర్వహించారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డి పులివెందుల తాలూకా వై.కొత్తపల్లె వాసి అని, చందమామ పత్రిక స్థాపన, విజయవంతంగా నిర్వహించడంతోపాటు విజయ ఆస్పత్రి తదితర సంస్థలను నెలకొల్పారని వివరించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు బీఎన్ రెడ్డితో కలిసి నాగిరెడ్డి విజయవాహిని స్టూడియోను ఏర్పాటు చేశారని వివరించారు. గ్రంథాలయ సహాయకులు హరిభూషణరావు మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ కళలు, వృత్తులను ఆదరిద్దాం

కడప కల్చరల్ : మన సంప్రదాయ కళలు, వృత్తులను ఆదరిద్దామని కడప మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్ తెలిపారు. శనివారం శ్రీ కళాజ్యోతి హస్తకళాకారుల సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో చేనేతలు, హస్తకళారూపాల ప్రదర్శన, అమ్మకాలను ఆయన ప్రారంభించారు. దేశంలోని అన్ని ఇతర రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ హస్తకళా రూపాలను ఈ ప్రదర్శనలో ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ ప్రదర్శనను ఆదరించాలని కోరారు. ప్రదర్శన మేనేజర్ వెంకయ్య మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

తేజ ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు



తేజ ఫిల్లింగ్ స్టేషన్‌లో అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని తేజ ఫిల్లింగ్ స్టేషన్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. శనివారం కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డితోపాటు తూనికలు, కొలతలు, ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. అల్మాస్‌పేటకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడుతూ పెట్రోలు ఫిల్లింగ్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక రూపొందించామన్నారు. నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

• కురిసింది వాన

కడప కార్పొరేషన్ : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం తీరం దాటి తుఫానుగా మారడంతో శనివారం జిల్లాలో వర్షం మొదలైంది. సన్నటి జల్లులతో ప్రారంభమైన వాన ఓ మోస్తరుగా కురిసింది. వర్షం వల్ల పాదచారులు, వీధి వ్యాపారస్తులు, తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మట్టి రోడ్లు తడిసి బురదమయంగా మారాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కూడలిలో..

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం యాకుబ్‌సాహెబ్ మసీదు స్మశానానికి సంబంధించిన విషయంలో పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు శనివారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు విన్నవించారు. కడపలో రోడ్ల విస్తరణ పేరుతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని వారు స్పష్టం చేశారు. ముస్లింల మత విశ్వాసాల ప్రకారం స్మశానం పవిత్రమైనదని పేర్కొన్నారు. స్మశాన స్థలాన్ని 12 నుంచి 15 అడుగుల మేర స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ అధికారులు, డిప్యూటీ సీఎంకు విన్నవించామన్నారు. చర్చలు జరిపి అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పిన మున్సిపల్ అధికారులు ఎవరికి చెప్పకుండా మసీదుకు సంబంధించిన కొంత భాగాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. దీంతో తాము నిరసన వ్యక్తం చేయగా, 27 మందిపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పేర్కొన్నారు. కనుక ఈ కేసులు ఎత్తి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్తార్, సీపీఐ, సీపీఎం నాయకులు వెంకట శివ, రామ్మోహన్‌రెడ్డి, బీఎస్పీ, డీఎంకే నాయకులు గుర్రప్ప, సుబ్బరాయుడు, అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సీఆర్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో రసాయనశాస్త్రం కీలకం

వైవీయూ : కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడంలో రసాయనశాస్త్రం మార్గం చూపించగలదని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని కళాశాలలో రసాయనశాస్త్రశాఖ ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ది కెమిస్ట్రీ ఇన్ డైలీ లైఫ్' అన్న అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి శాస్త్రం, పరిశోధన వెనుక సమాజ హితం ఉండాలన్నారు. ముఖ్యవక్తగా వైవీయూ రసాయనశాస్త్ర ఆచార్యులు డా. ఏజీ దాము మాట్లాడుతూ దైనందిత జీవితంలో రసాయనశాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. బెంగుళూరు రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డా.పి. మురళీ మాట్లాడుతూ పరిశ్రమలు, వైద్యరంగం, పౌష్టికాహారం తదితర రంగాల్లో రసాయనశాస్త్ర ప్రాముఖ్యను వివరించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డా. కె. నాగమునిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. విన్నీతేజ, అధ్యాపకులు డా. ఆనంద్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, మేరీసుగుణ, మాధవి, హిమకుమారి, సీతారాంరెడ్డి, వర్చువల్ విధానంలో 70 మంది పరిశోధకులు పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదు పక్కాగా ఉండాలి

కడప అగ్రికల్చర్ : రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాపు పంటల నమోదు పక్కాగా జరగాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప మండల పరిధిలో జరుగుతున్న ఈ క్రాపు నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రబీలో సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్నటువంటి రైతులకు మాత్రమే ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా (ఇన్సూరెన్స్ పథకం) వర్తిస్తుందన్నారు. ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం మంజూరు అవుతుందన్నారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ బాధ్యతగా వ్యవసాయ సిబ్బందిని కలిసి పంట నమోదును ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పావని, మెహరాజ్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

సస్యరక్షణతో అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్ : అరటిసాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి, సికెదిన్నె ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి పేర్కొన్నారు. శనివారం కడప, సికెదిన్నెలో గ్రామ ఉద్యాన సహాయకులు శిల్పతో కలిసి అరటితోటల సస్యరక్షణపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా తోటలు సాగు చేసుకునే వారు ఆరోగ్యవంతమైన తోటల నుంచి మాత్రమే పిలకలను సేకరించి నాటుకోవాలన్నారు. సేకరించిన పిలకలకు కాపర్ ఆక్సీక్లోరైడ్, మోనోక్రొటోపాస్ కలిపిన ద్రావణంలో ముంచి నీడలో ఆరబెట్టి తరువాత నాటుకోవాలన్నారు. తోటల్లో తెగులు సోకిన మొక్కలను దుంపలతో సహా తీసివేసి తోట బయట చిన్నముక్కలుగా చేసి ఎండిన తరువాత తగలపెట్టాలన్నారు. అలాగే మొక్కను తీసివేసిన చోట చుట్టుపక్కల ఆరోగ్యవంతమైన మొక్కల మొదళ్ల వద్ద మట్టి బాగా తడిసేలా బ్లీచింగ్ పౌడర్ కలిసిన నీళ్లతో తడపాలన్నారు. ఇలా చేస్తే ఆరటిలో మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామీణ ఉద్యాన సహాయకులు శిల్ప

పసుపు-కుంకుమ పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్ : పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో పనిచేస్తున్న 100 మంది మహిళా ఉద్యోగులు శనివారం జిల్లాలోని శైవ, వైష్ణవ క్షేత్రాల సందర్శనకు వచ్చారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంతోపాటు పలు క్షేత్రాలు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ సూచన మేరకు జిల్లా పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి మహిళా ఉద్యోగులకు పసుపు-కుంకుమ అందజేసి జిల్లాలోని పుణ్యక్షేత్రాల గురించి తెలియజేశారు. మహిళా ఉద్యోగులు ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈని ఘనంగా సత్కరించారు.



మహిళా ఉద్యోగులకు పసుపు-కుంకుమ అందజేస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి

కమలాపురంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

కమలాపురం : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. శనివారం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి ఆలయం నుంచి పుర వీధుల గుండా అత్యం వైభవంగా నిర్వహించారు. ఆలయ గురుస్వామి డాక్టర్ నరసింహశర్మ ఆధ్వర్యంలో శబరిమలై ఆచార, వ్యవహార తాంత్రిక పద్ధతిలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో కన్నెస్వాములు కళశాలతో పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు అయ్యప్ప గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, గణపతి హోమం, ప్రధాన కలశ స్థాపన, ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు, స్వామి వారికి విశేష పూజలు చేశారు. పట్టణం నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిట కిట లాడింది. నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



కమలాపురంలో గ్రామోత్సవంలో దీపాలతో కన్నె స్వాములు, మహిళా భక్తులు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ సన్నిదిలో ఉన్న అయ్యప్పలు గురుస్వామి నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కేరళ వాయిద్యం, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు నారీ శక్తి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప నగరం చెన్నై రోడ్డులోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి నారీ శక్తి సమ్మేళనం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా యల్లాయపల్లె చిన్మయారణ్యం స్వామిని శ్రేయానంద, పలువురు ప్రముఖ మహిళలు, వక్తలు హాజరు కానున్నారు. 9.00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.00 గంటలకు ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు చర్చ, సాయంత్రం 4.00 గంటలకు ముగింపు కార్యక్రమం ఉటుంది.

నూతన నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులుగా ఆది వెంకటసుబ్బయ్యను నియమించారు. శనివారం సాయంత్రం ఎస్సీమోర్చా అధ్యక్షులు కె.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ చేతుల మీదుగా 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నగరంలో వారు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, వుట్టి శ్రీనివాసులు, హరినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక బస్సును నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఈ బస్సు కడప నుంచి బయలు దేరుతుందన్నారు. బస్సులో పెద్దలకు రూ. 1070, పిల్లలకు రూ. 570 ఛార్జీగా నిర్ణయించారన్నారు. ఆసక్తిగల వారు బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

యునాని వైద్యంతో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు

కమలాపురం : అతి పురాతనమైన యునాని వైద్యంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అలాగే ఈ వైద్యంలో అన్ని రకాల రోగాలకు చికిత్సలు ఉన్నాయని ఒంటిమిట్ట యునాని వైద్యాధికారిణి నసీమున్నిసా తెలిపారు. శనివారం పట్టణంలోని బీడీ కాలనీలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ జాహిద్ హుసేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన దాదాపు 150 మంది రోగులను ఆమె పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యునాని వైద్యం చాలా పురాతనమైనదని, అన్ని దీర్ఘకాలిక రోగాలకు సైతం ఈ వైద్యంలో మందులు ఉన్నాయని, ప్రజలు ఈ మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయుష్ కమిషనర్, ఆర్‌డీడీ ఆదేశాల మేరకు కమలాపురంలో ఇప్పటికి నాలుగు శిబిరాలు నిర్వహించామన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలు తగవు

ప్రొద్దుటూరు : అశాస్త్రీయ భావాలకు జాతీయ విద్యావిధానం అద్దంపడుతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు తెలిపారు. మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానం అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, ప్రేమ్ కుమార్, బన్నీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు రథశాల ప్రారంభం

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలోని వెల్లాల గ్రామంలో ఉన్న శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించిన రథశాలను ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. ఆలయంలో వారు శనివారం మాట్లాడుతూ రెండేళ్ల క్రితం భక్తులు, దాతలచే నూతన రథాన్ని దాదాపు రూ.30లక్షలతో తయారు చేయించామన్నారు. ఆ రథాన్ని ఉంచేందుకు పగిడాలకు చెందిన దివంగత కానాల రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటరామిరెడ్డి రూ.16 లక్షలతో రథశాల నిర్మించారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

షాపుల్లో లైసెన్సులు ఉంచుకోవాలి

కడప అగ్రికల్చర్ : రైతుబజార్‌లో కూరగాయలు, కిరాణాషాపులకు సంబంధించిన యజమానులు తమ లైసెన్సులను కనిపించే విధంగా షాపుల్లో ఏర్పాటు చేసుకోవాలని కడప మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి పేర్కొన్నారు. శ శనివారం మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్యతో కలిసి ఆమె కడప రైతుబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు షాపు యజమానులను తమ లైసెన్సుల గురించి ఆరా తీశారు. వారు ఇంటి వద్ద ఉన్నాయని సమాధానం ఇచ్చారు. దీంతో ఆమె స్పందిస్తూ.. అందరి షాపుల్లో లైసెన్స్ కాపీలు కనిపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే మీ లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. అనంతరం ఆమె రైతు బజార్‌లో ఇటీవల జరిగిన డ్రైనేజీ, చప్పట, మంచినీటి పథకం మరమ్మతులను పరిశీలించారు. అనంతరం రైతు బజార్‌లోని సమస్యల గురించి ఎస్టేట్ ఆఫీసర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్ బయట ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న షాపుల యజమానులతో మాట్లాడారు. దారికి అడ్డంగా ఉన్న షాపులను తొలగించాలని సూచించారు.



రైతుబజార్‌లోని వ్యాపారులతో మాట్లాడుతున్న బంగారు గంగాదేవి

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

వైవీయూ : హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త మణికంఠ సూచించారు. శనివారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవిందరెడ్డి, షకీలా, జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసంస్థ అధ్యక్షుడు అశోక్, స్ప్రెడ్ స్మైల్ వ్యవస్థాపకులు సైలాభాను, వలంటీర్లు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు

ప్రభుత్వ బాలుర వసతి గృహం తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ పిల్లలకు అందుతున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటశాలను, వసతి గదులను, రిజిష్టర్లను పరిశీలించారు. జాతీయ, న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలపథకం-2015 గురించి వివరించారు. పిల్లల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ చట్టం, న్యాయ సహాయం, రక్షణ, సలహా వ్యవస్థ, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ వీరయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ దేవరాజు, కేస్ వర్కర్ సుదర్శన్‌రెడ్డి, వైద్యాధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

ఈవీఎం పనితీరుపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు అధిక ప్రాధాన్యత ఉన్న విషయాన్ని గుర్తించి ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. శనివారం పాతకడప సచివాలయ పరిధిలో ప్రజలకు ఆర్డీఓ ఈవీఎంల పనివిధానంపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు ఈవీఎంను ఉపయోగించి ఎలా ఓటు వేయాలో క్షుణ్ణంగా తెలియజేశారు. అనంతరం ఆయన ఓటుహక్కు గురించి తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2024 జనవరి 1వ తేదికి 18 ఏళ్లు పూర్తయ్యే వారంతా ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఓటరు మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుపై అధికారులకు సంబంధిత ఫారాలను అందజేయాలని ఆయన సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో అధికారులకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ప్రజలకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

అన్ని సదుపాయాలతో వ్యవసాయ కళాశాల

పులివెందుల : వ్యవసాయ కళాశాలకు అవసరమైన అన్ని సదుపాయాలు ప్రభుత్వ సహకారంతో కల్పించామని ఇంకా కళాశాలకు కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన వ్యవసాయ కళాశాలను ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీ కార్ల్ ప్రాంగణంలో 60 మంది విద్యార్థులతో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కళాశాలలో చక్కటి తరగతి గదులు, సౌకర్యవంతమైన ల్యాబ్‌లు తక్కువ సమయంలోనే అందుబాటులోకి తీసుకరావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పులివెందుల వ్యవసాయ కళాశాలకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డిలను వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సుధాకర్, జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీఎస్ నాయుడు, ఫుడ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ డాక్టర్ సర్దార్ బేగ్, ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ఈ నెల 19న చాపాడు మండలంలోని సీబీఐటీ కళాశాలలో జరుగనుందని దీనిని విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఉపవిద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రొద్దుటూరు డివిజన్‌లోని మండలాల ఎంఈఓలతో జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమేటిక్స్, ఎర్త్‌అండ్ స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంజనీరింగ్, బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ మొత్తం 8 అంశాలపై నమూనాలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఈ నెల 13వ తేదీ లోపల పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించి అందులో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టును మండల స్థాయికి ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 16 లోపల మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి 3 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేయాలని వివరించారు. మండలానికి 3 చొప్పున, 36 మండలాలకు 108 నమూనాలు జిల్లాస్థాయిలో ప్రదర్శిస్తారన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన నమూనాలను ఈ నెల 28, 29లలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శిస్తారన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, డివిజన్ పరిధిలోని మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

కమలాపురం : ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీరాపురం, పాచికలపాడు గ్రామాలలో సాగులో ఉన్న శనగ, పెసర తదితర పంటలను పరిశీలించి మాట్లాడారు. శనగ పంటకు పొగాకు లద్దె పురుగు, రబ్బరు పురుగులు ఎక్కువగా ఆశించాయన్నారు. ఇవి శనగ పంటను కాండం నుంచి నాశనం చేస్తాయన్నారు. వాటి నివారణకు 1.5 మి.లీ. నోవాల్యూరాన్, ఇండాక్సాకార్బ్‌ను లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. లేని పక్షంలో 0.5 మి.లీ.టెట్రనిలిప్రోల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము పంటకు అక్కడక్కడ ఎల్లోమొజాక్ ఆశించిందన్నారు. దీని నివారణకు 1మి.లీ. స్పైరో మేసిఫెన్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.